క్లుప్తంగా

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం హరేకృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణ, సుభద్ర, బలభద్ర జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

'ఆడుదాం ఆంధ్రా'కు విశేష స్పందన



కిట్లు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ కొండబాబు

కొమ్మాది: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి యువత నుంచి విశేష స్పందన లభిస్తోందని కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు అన్నారు. జీవీఎంసీ 4వ వార్డు చేపలుప్పాడలో స్పోర్ట్స్ కిట్లను ఆయన పపిణీ చేశారు. యువత ఉత్సాహంగా క్రీడా పోటీల్లో పాల్గొంటున్నారని, వార్డులో అన్ని సచివాలయాల పరిధిలో పోటీలు కొనసాగుతున్నట్లు తెలిపారు.

శాలివాహనుల సమస్యలపై వినతి



గడ్డప్పను సన్మానిస్తున్న సంతపేట శాలివాహన సంఘం ప్రతినిధులు

తగరపువలస: తాము ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జీవీఎంసీ రెండో వార్డు శాలివాహన సంఘం ప్రతినిధులు జిల్లా బీసీ కులాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొత్తూరు గడ్డప్పను ఆదివారం కోరారు. అనకాపల్లి జిల్లా అడ్డూరు గ్రామంలోని మజ్జిగౌరమ్మ ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో వీరు పాల్గొన్నారు. కొత్తగా ఎన్నికైన గడ్డప్పను సత్కరించి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో శాలివాహన సంఘం అధ్యక్షుడు అరటికోట్ల వెంకటేష్, కార్యదర్శి కొత్తూరు త్రినాథ భాస్కర్, కోశాధికారి తాటిపూడి శ్రీనివాసరావు, కొప్పాక రామకృష్ణ, పెనుగుర్తి వెంకట సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నవనీతోత్సవం



వెన్నతో అలంకరణలో దర్శనమిచ్చిన కుంతీ మాధవ స్వామి

పద్మనాభం: పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయంలో ఆదివారం ఏకాదశిని పురస్కరించుకుని నవనీతోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి ఒంటి గంట నుంచి తెల్లవారుజాము ఐదు వరకు అర్చక స్వాములు కుంతీ మాధవ స్వామిని వెన్నతో అలంకరించారు. తదుపరి స్వామికి విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. ఆరు గంటల నుంచి భక్తులకు స్వామి దర్శన భాగ్యం కల్పించారు. సోమవారం సాయంత్రం ఆరు గంటల వరకూ కుంతీ మాధవ స్వామి వెన్న అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారు. పరిసర ప్రాంతాలైన మద్ది, కృష్ణాపురం, రెడ్డిపల్లి, విలాస్కాన్ పాలెం గ్రామాల నుంచే కాకుండా దూర ప్రాంతాలైన విశాఖపట్నం, విజయనగరం, సింహాచలం నుంచి తరలివచ్చిన భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు చేశారు.

23 ఏళ్లనాటి కల సాకారం

- రూ.9 కోట్లతో కె.నగరపాలెం – బోయపాలెం రోడ్డు విస్తరణ
- భూముల ధరలు పెరగడంతోపాటు ప్రయాణం సులభతరమైందని స్థానికుల హర్షం



నిర్మాణం పూర్తయిన కాపులుప్పాడ రోడ్డు



విశాలంగా విస్తరించిన బోయపాలెం వెళ్లే రోడ్డు

కొమ్మాది : కె.నగరపాలెం, బోయపాలెం, కల్లివానిపాలెం, సోమన్నపాలెం తదితర ప్రాంతాల ప్రజల సుదీర్ఘ స్వప్నం సాకారమైంది. 23 ఏళ్లుగా ఎదురు చూస్తున్న రోడ్డు విస్తరణ జగనన్న ప్రజా ప్రభుత్వంలో పూర్తయింది. ఫలితంగా తమ భూముల ధరలు పెరగడంతోపాటు ప్రయాణం సులభతరమైందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బీచ్ రోడ్డు కె.నగరపాలెం నుంచి బోయపాలెం వెళ్లాలంటే కొద్ది రోజుల కిందటి వరకూ పెద్ద సాహసమే. 30 అడుగుల రోడ్డులో ఓ వాహనం వస్తే... ఎదురుగా వచ్చే మరో వాహనం ఆగిపోయే పరిస్థితి. దీనిని దృష్టిలో పెట్టుకుని 2000లో రోడ్డు విస్తరించాలని అప్పటి అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రణాళికలు రూపొందించినప్పటికీ కార్యరూపం దాల్చలేదు. ప్రభుత్వాలు మారినా ఆ రోడ్డు పరిస్థితి మాత్రం మారలేదు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 23 ఏళ్ల నాటి కల సాకారమైంది అంటూ స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మొత్తం 9 కోట్ల వ్యయంతో 2.5 కిలో మీటర్ల మేర రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి. కె.నగరపాలెం నుంచి సోమన్నపాలెం వరకు 40 అడుగులు, సోమన్నపాలెం నుంచి విల్లాసం వరకు 60 అడుగులు, విల్లాసం నుంచి బోయపాలెం వరకు 100 అడుగుల మేర రోడ్డు ఇప్పటికే విస్తరించారు. రోడ్డుకు ఇరువైపులా పెద్ద ఎత్తున డ్రైనేజీ, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. స్థానికులకు నష్టం జరగకుండా ముందుగానే గ్రామ సభలు నిర్వహించి, తొలగించిన నిర్మాణాలకు నష్టపరిహారం చెల్లించడంతో ఇదే కదా ప్రజా ప్రభుత్వం అంటే అని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కె.నగరపాలెం నుంచి బోయపాలెం వరకు రోడ్డు విస్తరణ జరగడంతో తమ భూములకు విలువ పెరిగిందని, అదేవిధంగా వ్యాపారపరంగా అభివృద్ధి చెందుతోందని, రాకపోకలకు అనువుగా మారిందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అభివృద్ధి అంటే ఇదే కదా అంటూ కాపులదిబ్బడపాలెం, కె.నగరపాలెం, సోమన్నపాలెం, రెడ్డిలపాలెం, కాపులుప్పాడ, కల్లివానిపాలెం, బోయపాలెం ప్రాంతాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చిన్ననాటి కల నెరవేరింది



నా చిన్నప్పటి నుంచి ఈ రోడ్డు విస్తరణ జరుగుతుందని వింటున్నా. చాలా ఏళ్ల తర్వాత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రోడ్డు విస్తరించడంతో మా సుదీర్ఘ నిరీక్షణ ఫలించింది. రోడ్డు వెడల్పు కావడంతో ప్రయాణం సులభతరం కావడంతోపాటు సమయం ఆదా అవుతోంది.

– వై.విష్ణు, కల్లివానిపాలెం.

భూముల ధరలు పెరిగాయి



మా ప్రాంతంలో రోడ్డు విస్తరించడంతో ఒక్కసారిగా భూముల ధరలు పెరిగాయి. కొద్ది రోజుల కిందటి వరకు మా ప్రాంతానికి కారులో ఎవరైనా రావాలంటే రోడ్డు చిన్నది కావడంతో భయపడేవారు. ఇప్పుడు రోడ్డు నిర్మించడంతో ప్రయాణం సులభతరమయ్యింది. వ్యాపారపరంగా కూడా చాలా అభివృద్ధి చెందుతోంది.

– ఎమ్.అప్పలరాజు, కె.నగరపాలెం.

వ్యాస రచన పోటీలు నేడు

భీమునిపట్నం: స్వామి వివేకానందుని జయంతి సందర్భంగా యువ భారత్, వివేకానంద రీడింగ్ రూమ్ ఆధ్వర్యంలో సోమవారం వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నామని కార్యక్రమ నిర్వాహకులు సంకురుభుక్త జోగారావు, జరజాపు సురేష్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు 'స్వామి వివేకానంద స్ఫూర్తి – యువతకు ఆదర్శం' అనే అంశంపై ప్రభుత్వ కళాశాల వద్ద ఉదయం 10 : 30 గంటల నుంచి వ్యాస రచన పోటీలు నిర్వహిస్తామని, విజేతలకు బహుమతులు అందిస్తామని తెలిపారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



నృత్యం చేస్తున్న కళాకారులు

మధురవాడ: పాటకు తగ్గట్టుగా చక్కని అభినయంతో కళాకారులు చేసిన నృత్యాలు ఆహుతులను ఆద్యంతం కట్టిపడేశాయి. ఇందుకు శిల్పారామం వేదికైంది. వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా విశాఖపట్నం వారాహి కూచిపూడి అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం కళాకారులు నృత్యం చేశారు. యస్.పరమేశ్వరి నృత్య దర్శకత్వంలో శిల్పారామ పరిపాలనాధికారి టి.విశ్వనాథరెడ్డి పర్యవేక్షించారు.

ఇంటింటికీ అయోధ్య అక్షింతలు



మారికవలసలో అయోధ్య రాముని అక్షింతలు ఊరేగిస్తున్న భక్తులు



చిట్టివలస శివాలయం వీధిలో ఇంటింటికీ అక్షింతలు పంపిణీ చేస్తున్న హిందూ ప్రచార సమితి ప్రతినిధులు



కొండపేట పంప్‌హౌస్ వీధిలో అక్షింతలు పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

తగరపువలస: అయోధ్య భవ్య రామమందిర ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా ఆదివారం హిందూ ప్రచార సమితి ప్రతినిధులు తగరపువలస, చిట్టివలస గ్రామాల్లో పలుచోట్ల అక్షింతలు పంపిణీ చేశారు. ఈ నెల 22న అయోధ్యలో మందిరం ప్రారంభోత్సవం సందర్భంగా ఇంటి వద్ద ఆచరించాల్సిన కార్యక్రమాలను వివరించారు. కొండపేట, కొత్తపేట, కార్మికవాడలో కూడా అక్షింతలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గుజ్జు సూరిబాబు, బోళ్ల రాంబాబు, భవానీ, టి.అనురాధ, గుండు అరుణ, ఉప్పాల నవీన్‌కుమార్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మారికవలస ఆర్‌జీకే కాలనీలో...

మధురవాడ: అయోధ్య రామ మందిరం నిర్మాణ ట్రస్ట్ నుంచి వచ్చిన అక్షింతలు జీవీఎంసీ 5వ వార్డు మారికవలస ఆర్‌జీకే కాలనీలో గల శ్రీ గణపతి దేవాలయ సముదాయం నుంచి ఊరేగించారు. కాలనీలోని వివిధ ప్రాంతాల్లో ఊరేగించి ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 500 నివాసాలకు ఆదివారం పంచి పెట్టారు. వీటిని తీసుకున్న గృహిణులు అయోధ్య రాముని ప్రసాదం అంటూ తన్మయత్వానికి గురయ్యారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ కార్యవర్గ సభ్యులు, భక్తులు సుబ్బరాజు, నర్సింగరావు, రుషికేశ్వరరావు, గణపతి, వి.శంకరరావు, చంద్ర మహంతి వెంకటరమణ, దేవి, గాయత్రి, భారతి, జ్యోత్స్న, రమ్య, గీత, కేదారేశ్వరి, పద్మ తదితరులు పాల్గొన్నారు.



మద్దిలో అయోధ్య అక్షింతలను ఊరేగిస్తున్న దృశ్యం

పద్మనాభం: మండలంలోని మద్ది గ్రామంలో అయోధ్య నుంచి తీసుకొచ్చిన అక్షింతలను ఆదివారం ఊరేగించారు. రామాలయంలో ఉన్న అక్షింతలను గ్రామమంతా ఊరేగించి ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు బుగత సత్యనారాయణ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

33,286 మందికి కంటి శస్త్ర చికిత్సలు

శంకర్ ఫౌండేషన్ డీజీఎం బంగార్రాజు



శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రి

సింహాచలం: నేత్ర వైద్య సేవల్లో నాయుడుతోటలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి అద్భుత పనితీరు కనబరుస్తోందని ఆస్పత్రి డీజీఎం కె. బంగార్రాజు తెలిపారు. 2023లో నిర్వహించిన శస్త్ర చికిత్సలు, ఇతర వివరాలను ఆదివారం ఆయన వెల్లడించారు. 2023లో 33వేల 286 కంటి శస్త్ర చికిత్సలు నిర్వహించినట్టు తెలిపారు. 1997లో ఆస్పత్రి స్థాపించిన నాటి నుంచి ఇప్పటి వరకు 4లక్షల 33వేల 286 కంటి శస్త్ర చికిత్సలు నిర్వహించిందని తెలిపారు.

రెటీనా, గ్లకోమా,కార్నియా వంటి ప్రత్యేక కంటి శస్త్ర చికిత్సల్లో ఉత్తమ ప్రగతి సాధించిందన్నారు. డాక్టర్ వైఎస్సార్‌సీ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా 58 శాతం పైగా రోగులకు కంటి వైద్య సేవలు అందించామన్నారు. 2023లో గ్లకోమా నివారణకు ఒక రోగికి గ్లకోస్ ఐస్టంట్ శస్త్ర చికిత్స తొలిసారిగా నిర్వహించి రికార్డు సృష్టించినట్టు తెలిపారు. గాజువాక బీసీ రోడ్డులో అత్యాధునిక ఆపరేషన్ థియేటర్ ఏర్పాటు చేసిన ఆస్పత్రిలో సేవలు సంక్రాంతి నుంచి అందుబాటులోకి వస్తాయన్నారు. గ్రామాల్లో ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించడం ద్వారా అంధత్వ నివారణకు శంకర్ ఫౌండేషన్ ఎంతో కృషి చేస్తోందని తెలిపారు.

రైల్వేలో రాయితీలు కల్పించాలి

తగరపువలస : కోవిడ్ – 19కు ముందు అమలులో ఉన్న సాధారణ, సెకెండ్ క్లాస్ రైల్వే చార్జీలు, సీనియర్ సిటిజన్స్‌కు రాయితీలు ప్రస్తుతం కొనసాగించాలని కోరుతూ నగరానికి చెందిన సామాజిక కార్యకర్త జి.అప్పన్న కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు లేఖ రాశారు. ఈ సందర్భంగా అప్పన్న మాట్లాడుతూ కరోనా తర్వాత దేశవ్యాప్తంగా సాధారణ రైల్వే టిక్కెట్ల ధరలు 50 శాతం పెంచారన్నారు. దీంతో సామాన్య ప్రజలు, చిరు వ్యాపారులు, ఉద్యోగులు, రోగులకు టిక్కెట్ల ధరల పెంపు భారంగా మారిందన్నారు. సీనియర్ సిటిజన్స్‌కు రాయితీలు ఎత్తివేయడం వల్ల వారు కూడా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముఖ్యంగా ప్యాసింజర్ రైళ్లలో ప్రయాణాలు సాగించే కోస్తాంధ్ర ప్రజలు ఇబ్బందులు పడుతున్నందున వారికి ఊరట కలిగించాలని లేఖలో కోరినట్టు అప్పన్న తెలిపారు.

నిరుపేదలకు సంక్రాంతి కానుకలు



పేదలకు పండగ కానుకలు అందజేస్తున్న నాయకులు



సంక్రాంతి సంబరాల్లో అసోసియేషన్ సభ్యులు



సంక్రాంతి సంబరాల్లో సాముగరిడీ ప్రదర్శనలో విద్యార్థులు



పులివేషాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

మధురవాడ: సంక్రాంతి పండగను పురస్కరించుకుని స్వతంత్రనగర్‌లో మధురవాడ శిష్టకరణాలు అసోసియేషన్ ఆధ్వర్యంలో పేదలకు కానుకలు అందజేశారు. 150 మందికి నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షుడు నౌపాడ ఆనందరావు, బీవీఎన్ పాత్రో, కె.గోవిందరావు, కె.నీలకంఠేశ్వరరావు, యు.కొండలరావు, డి.మోహన్‌రావు, బి.అనురాధ, కె.రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

భీమునిపట్నం: భీమిలి సమీపంలోని కీతిన్‌పేట వద్దనున్న సన్‌స్కూల్‌లో ఆదివారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ కైతపల్లి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థుల బళ్లవేషాలు, పులివేషాలు, తప్పెటగుళ్లు, కోలాటం, సాముగరిడీ, బొమ్మల ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం శ్రీనివాసరావు మాట్లాడుతూ పిల్లలకు తప్పనిసరిగా మన సంప్రదాయాలు, సంస్కృతిని తెలియజేయాలన్నారు. సంక్రాంతి పండగ గొప్పదనాన్ని ప్రదర్శన ద్వారా తెలియజేయడంతో అందరికీ అర్థమవుతుందన్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లలకు సంప్రదాయాలను తెలియజేయాలన్నారు.

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడలో అథ్లెటిక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ముందుగా అసోసియేషన్ సభ్యులు భోగి మంట వేసి, ముగ్గుల పోటీలు, హరిదాసు నామ సంకీర్తన పోటీలు నిర్వహించారు. ప్రెసిడెంట్ బి.ప్రసాదరావు, సెక్రటరీ సీతామహాలక్ష్మి, డాక్టర్ శ్రీనివాస్, శైలజ పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

ఘనంగా సంక్రాంతి సంబరాలు

మధురవాడ: క్రికెట్ స్టేడియం సమీపంలోని గ్రీన్‌డేల్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో వార్షిక స్పోర్ట్స్ మీట్, సంక్రాంతి సంబరాలు ఆదివారం ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ డాక్టర్ ఎస్‌పీ రవీంద్ర మాట్లాడుతూ విద్యార్థులు పరిపూర్ణులుగా తయారయ్యేందుకు చదువుతోపాటు ఆటలు, కళలు, వివిధ రకాల స్టాల్స్ ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నామన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఇటీవల నిర్వహించిన పోటీల విజేతలకు ముఖ్య అతిథిగా హాజరైన వైభవ్ జ్యూలయర్స్ చైర్మన్ మల్లికా మనోజ్, పాఠశాల చైర్మన్ రవీంద్ర బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ విజయ, ప్రిన్సిపాల్ దివ్య దాస్, సైనట్ ఫార్మా డైరెక్టర్ సిద్ధార్థ కరని, గ్రేహౌండ్స్ ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు పాల్గొన్నారు.

సాహూ కుటుంబాన్ని కుదిపేసిన క్యాన్సర్

- దాతల సాయం కోసం ఎదురుచూపు



హరిశ్చంద్ర సాహూ

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు కొండపేటకు చెందిన హరిశ్చంద్ర సాహూను మూడేళ్ల క్రితం క్యాన్సర్ కాటేసింది. ఒడిశా నుంచి 40 ఏళ్ల క్రితమే పొట్ట చేతపట్టుకుని చిట్టివలస వచ్చిన వీరి కుటుంబం చిట్టివలసలో ఉంటుంది. ఆనందపురం మండలంలోని స్టీల్ ఫ్యాక్టరీలో లేబర్ ఇన్‌చార్జిగా విధులు నిర్వర్తించే సాహూది చింతలు లేని చిన్న కుటుంబం. ఈయనకు భార్య జయంతి, కుమార్తె జ్యోత్స్న ఉన్నారు. అయితే సాహూకు గుట్కా అలవాటు వుండడంతో అది గొంతు క్యాన్సర్‌కు దారి తీసింది. కరోనా మొదటి విడత సమయంలో నకిలీ గుట్కాల కారణంగా వ్యాధి మరింతగా కుంగదీసింది. 2020 నుంచి పలు ఆస్పత్రుల్లో చికిత్స కోసం తిరుగుతూ అంతకు ముందు కూడబెట్టుకున్న రూ.5 లక్షలు ఖర్చు చేశాడు.

ఆర్థిక వనరులు నిండుకుపోవడంతోపాటు అనారోగ్యం కారణంగా ఉద్యోగానికి కూడా వెళ్లలేకపోయాడు. ప్రస్తుతం ఆరోగ్యశ్రీ ద్వారా అగనంపూడిలోని హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నాడు. అక్కడ శస్త్రచికిత్స చేసి రేడియేషన్ ఉచితంగా అందిస్తున్నారు. మందులు, రాకపోకలకు కూడా ఖర్చు చేసే స్థోమత లేక తెలిసిన వారిపై ఆధారపడుతున్నారు. దీనికితోడు డిప్లమో చదువుతున్న కుమార్తెకు ఖర్చు చేయలేని పరిస్థితి సాహూ కుటుంబంలో నెలకొని ఉంది.

మూడేళ్లుగా ద్రవాహారమే...

2019 చివరలో ఆహారం మింగుడుపడకపోవడంతో స్థానిక ఆస్పత్రుల్లో హరిశ్చంద్ర సాహూకు తనిఖీ చేయించగా గొంతు క్యాన్సర్‌గా నిర్ధారించారు. అప్పటి నుంచి కేవలం ద్రవాహారం మాత్రమే తీసుకోగలుగుతున్నాడు. ప్రభుత్వం అందించే డీఎంహెచ్‌వో పింఛను కోసం ఇటీవల తరపువలస పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించారు. ప్రస్తుతం కుటుంబ పోషణ, మందుల ఖర్చు, కుమార్తె చదువుకోసం దాతలు స్పందించి ఆదుకోవాలని సాహూ, అతని భార్య జయంతి కోరుతున్నారు. దాతలు సాహూను 90305 69030లో సంప్రదించవచ్చు. బ్యాంకు ద్వారా సాయం చేయాలనుకునేవారు ఖాతా నంబర్ 11365981065, చిట్టివలస ఎస్‌బీఐ బ్రాంచ్ (AIN0002704)కు సాయం అందించవచ్చు.

3కే మారథాన్‌కు అనూహ్య స్పందన

గాజువాక: రోగాల బారి నుంచి గుండెను కాపాడుకుందాం నినాదంతో పల్లా కార్తీక్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం ఇక్కడ 3కే మారథాన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యువతీ యువకుల నుంచి అనూహ్య స్పందన లభించింది. పాత గాజువాక 60 అడుగుల రోడ్‌లో ప్రారంభమైన మారథాన్ సినిమా హాల్ జంక్షన్, కొత్త గాజువాక పెట్రోల్ బంక్ వరకు, అక్కడి నుంచి తిరిగి పాత గాజువాక వరకు కొనసాగింది. యువత, స్వచ్ఛంద సంస్థలు, పౌర సంఘాలు, వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రస్టు అధ్యక్షుడు పల్లా కార్తీక్ మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్యం కోసం రోజూ వ్యాయామం తప్పనిసరిగా చేయాలన్నారు. అనంతరం మారథాన్‌లో పాల్గొన్న వారికి టీ షర్టులు, సర్టిఫికెట్లు, ట్రోఫీలు అందజేసి అభినందించారు.

వేడుకగా పింఛన్ల పంపిణీ



సంతపేట గొల్లవీధిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు



సత్యనారాయణపేటలో పింఛన్లు పంపిణీ చేస్తున్న వలంటీర్లు



మార్కెట్ వీధిలో పింఛన్ల పంపిణీలో వలంటీర్, వైఎస్సార్‌సీపీ నాయకులు



మారికవలస ఆర్‌జీకే కాలనీలో పింఛన్లు పంపిణీ చేస్తున్న వలంటీర్ పుష్పలత, సచివాలయ కన్వీనర్ సీత, మోహన్‌రావు, నాయకులు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్‌లో ఆదివారం కూడా ఇంటింటా పింఛన్ల పంపిణీ కార్యక్రమం వేడుకగా సాగింది. ఇటీవల ప్రభుత్వం పెంచిన రూ.250లు కలిపి రూ.3 వేలు వంతున లబ్ధిదారులకు అందజేశారు. దీంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. సంతపేట గొల్లవీధిలో పింఛన్ల పంపిణీలో వైఎస్సార్‌సీపీ నాయకులు సరగడ నాగిరెడ్డి, మద్ది మహాలక్ష్మి, ఇంజే వరలక్ష్మి, కొయ్య వెంకటలక్ష్మి, దంతులూరి సీతారామరాజు తదితరులు పాల్గొన్నారు. సత్యనారాయణపేటలో వలంటీర్‌తోపాటు వైఎస్సార్‌సీపీ నాయకుడు తెడ్లాపు అప్పలరాజు పింఛన్లు అందించారు. ఆదర్శనగర్‌లో వలంటీర్ సరగడ కిరణ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు కంచుబోయిన వెంకటరావు పింఛన్లు అందించారు. మార్కెట్ వీధిలో వలంటీర్ నాగలక్ష్మితోపాటు వైఎస్సార్‌సీపీ నాయకులు చిప్పాడ వెంకటేష్, చేట్ల ఎల్లయ్యరెడ్డి పింఛన్లు అందించారు.

ముగిసిన డెంటల్ విద్యార్థుల సాహసయాత్ర



లంబసింగిలో అనిల్ నీరుకొండ డెంటల్ వైద్య విద్యార్థులు

తగరపువలస: సంగివలస అనిల్ నీరుకొండ డెంటల్ వైద్య విద్యార్థులు ఎన్‌ఎస్ఎస్ శిబిరంలో భాగంగా చేపట్టిన రెండు రోజుల సాహసయాత్ర ఆదివారంతో ముగిసింది. సామాజిక బాధ్యత, కలివిడితనం, నాయకత్వం, శారీరక ఆరోగ్యం, ట్రెక్కింగ్ తదితర లక్షణాలు పెంపొందించే క్రమంలో చేపట్టిన సాహసయాత్ర అల్లూరి సీతారామరాజు జిల్లా లంబసింగిలో సాగింది. చదువుతోపాటు ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులకు అవసరమని ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ శివకుమార్ తెలిపారు. 50 మంది వలంటీర్లతోపాటు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్.వంశీకృష్ణారెడ్డి పాల్గొన్నారు. వీరిని కళాశాల డీన్ డాక్టర్ పీవీ సుధాకర్ అభినందించారు.